International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-1, January-March, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# వివిధ రకాల పత్రికలు – పరిశీలన, పత్రికా భాష, శైలి, వైవిధ్యం

డా॥ ఎల్లే విజయానందరాజు,
తెలుగు ఉపన్యాసకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు.
సెల్ : 94410 88634

**ఉపోద్ఘాతం :** ప్రాచీన కాలంలోనే "వార్తయందు జగము వర్ధిల్లుచున్నది" అని వార్తా ప్రస్తావన కన్పిస్తుంది. పురాణ యుగంలో ఈ ప్రపంచానికి ప్రప్రథమ వార్తాహరుడు నారదుడే అనాలి. లోకాన్నంతా సంచరిస్తూ లోక కళ్యాణం కోసం ఆయన చేసిన 'వార్తా ప్రసారం' అంతా ఇంతా కాదు. తరువాత కాలంలో కళాకారులు ఆ పాత్రను పోషించారు. రాజులు కళాకారులను పోషిస్తూ వివిధ కళారూపాల ద్వారా దేశ విదేశాలలో జరుగుచున్న విషయాలను ప్రజలకు తెలియజేసేవారు.

పత్రికా రచన, నిర్వహణ మొదలైన సమస్త విషయాలకు సంబంధించిన శాస్త్రాన్ని జర్నలిజం (Journalism) అని పిలుస్తున్నారు. ఇది ప్రసార శాస్త్రం (Communication Science) అని పిలిచే స్థాయికి ఎదిగింది.

జర్నలిజం అనే ఆంగ్లమాటకు మూలం 'Journal' అనే పదం. దీని అర్థం 'అనుదినం' (daily). ఇది లాటిన్ భాషలోని Diurnal/Diurnalism పదాల నుంచి ఆవిర్భవించింది. 'Diurnal' అనే మాట 'dies' (దినము, day) అనే నామధాతువు నుంచి పుట్టింది.

'Journal' అనే పదానికి అనేక విశేష్యార్థాలు కూడా ఉన్నాయి.

1. దినచర్య
2. దినచర్య గ్రంథం
3. శాసనసభ, సంఘం, క్లబ్బు వంటి సంస్థల వ్యవహారాలను నమోదు చేసిన పుస్తకం.
4. నౌక ప్రయాణాది వివరాలను రాసిన పుస్తకం
5. దినపత్రిక

లాటిన్ భాషలోని 'Diurnal' పదానికి diary అని Daily Record Events అని అర్థాలు చెప్పబడ్డాయి. అయితే 'జర్నల్'ను పత్రిక అని మనం తెలుగులో వ్యవహరిస్తున్నాం. ప్రాచీన కాలములో ఓడ ప్రయాణం లాంటి సందర్భాలలో రోజువారి పద్దుల్ని రాసే అలవాటు ఉండేది. క్రమక్రమంగా వాటిని ప్రచురించే పనిని ప్రారంభించారు. ఇలా ఇతర విషయాల్ని కూడా సేకరించి ప్రచురించడంతో పత్రిక ప్రారంభమయ్యింది.

**Journal - Oxford Dictionary :**
1. News Paper Periodicals
2. Daily Record of Events
3. Book in which transactions and accounts are entered

Journalism అనే పదానికి అర్థాన్ని బట్టి వార్తా పత్రికలను ఎడిట్ చేసే వృత్తిని జర్నలిజం అని అంటున్నారు. పత్రికా రచన వృత్తిలో ఉన్న వ్యక్తిని Journalist అని వ్యవహరిస్తున్నాం. దీనికి తెలుగు అర్థం పాత్రికేయుడు.

## పత్రికలు - పరిచయం

'పత్రికలు అనే పదానికి వార్తలు మొదలైన వాటిని తెలిపే కాగితము' అని నిఘంటువులు అర్థం చెబుతున్నాయి. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సమస్యలపై సాధారణ ప్రజానీకానికి ఖచ్చితమైన అభిప్రాయాలను అందించేది వార్తా పత్రిక అని కొందరి అభిప్రాయం. ఈ పత్రికలు ప్రజాస్వామ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న" అంటూ ప్రజాస్వామ్యంలో పత్రికలకున్న స్థానాన్ని నార్ల వెంకటేశ్వరరావు గారు ఈ పద్యంలలో తెలియజెప్పారు.

ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్ట్ జేమ్స్ రెస్టెన్ 20 శతాబ్దిని పత్రికా రచయిత యుగమన్నాడు. "The Nineteenth Century was the era of the Novelist. The Twentieth Century is the ear of Journalist" అంతేకాక "పత్రికలు లేని ప్రభుత్వం కావాలా? ప్రభుత్వం లేని పత్రికలే కావాలా? అని నన్ను ఎవరన్నా ప్రశ్నిస్తే ప్రభుత్వంలేని పత్రికలే కావాలని నిస్సందేహంగా చెప్తాను" అనిన మాటలను బట్టి సమాజంలో పత్రికలు ఎటువంటి పాత్రను పోషిస్తున్నాయో అర్థమవుతుంది.

## పత్రికలు - రకాలు

పత్రికలు వెలువడే కాలం, తీరు తెన్నులను బట్టి అవి చాలా రకాలుగా ఉన్నాయి. ముఖ్యంగా పత్రికలు ప్రచురించే కాలాన్ని అనుసరించి దిన, వార, పక్ష, మాస పత్రికలని, పత్రికల్లో ప్రచురితమయ్యే అంశాలను బట్టి వార్త, సాహిత్య, ఆర్థిక, సాంకేతికాది పత్రికలని, ప్రచురణ పొందే పద్ధతులను బట్టి అచ్చు, రాత, గోడ పత్రికలని వర్గీకరణ చేసుకోవచ్చు.

**దినపత్రికలు :**

ప్రతిరోజూ క్రమం తప్పక ప్రచురించే పత్రిక. ఇందులో తాజా వార్తా విశేషాలు ఉంటాయి.
***ఉదాహరణకు :*** ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, సాక్షి మొదలైనవి.

**వారానికి రెండుసార్లు వెలువడే పత్రికలు :**

తెలుగులో వారానికి రెండుసార్లు వెలువడే పత్రికలు చాలా తక్కువ. ఇవి వార్తా పత్రికలై ఉంటాయి. కడపజిల్లా రాజంపేట నుంచి "సహస్రాబ్ది" అనే పత్రిక వారానికి రెండుసార్లు వెలువడేది.

**వారపత్రికలు :**

ప్రతివారం క్రమం తప్పక వెలువడే పత్రికలు. ఇవి దినపత్రిక సైజులో నాలుగోవంతు ఉంటాయి. చాలావరకూ వీటిలో కాలక్షేప పత్రికలున్నాయి.
***ఉదాహరణకు :*** ఇండియాటుడే, సుప్రభాతం, స్వాతివీక్లీ, నవ్యవీక్లీ, ఆంధ్రభూమి వీక్లీ మొదలైనవి.

**పక్షపత్రికలు :**

పదిహేను రోజులకొకసారి వెలువడే పత్రికలను పక్షపత్రికలని అంటారు. సాధారణంగా ఇవి వైవిధ్యమైన అంశాలతో ఉంటాయి. విద్య, ఉపాధి, పోటీ పరీక్షల విషయాలతో వెలువడుతున్న పత్రికలు ఈ కోవలోకి వస్తాయి.

***ఉదాహరణకు :*** విజేత కాంపిటీషన్స్, ఉద్యోగ సోపానం, జనశక్తి మొదలైనవి.

**మాసపత్రికలు :**

నెలరోజులకొకసారి పాఠకులను పలకరించే పత్రికలను మాస పత్రికలు అంటారు. ఇవి వైవిధ్యమైన అంశాలతో ఉన్నప్పటికీ ఎక్కువగా కథలూ, కవితలూ ఇందులో ఉంటాయి. ఇతర విషయ సంబంధ పత్రికలు కూడా ఉన్నాయి.

***ఉదాహరణకు :*** స్వాతి, చందమామ, చతుర, విపుల మొదలైనవి.

**ద్వైమాస పత్రికలు :**

రెండు నెలలకొకసారి ముద్రించే పత్రికలు. ఇవి కొన్ని విషయసంబంధమైనవి. మరికొన్ని సంస్థాగతమైనవి. ఇవి ఎక్కువగా చందాదారులకే పరిమితమై ఉంటాయి.

***ఉదాహరణకు :*** ఉద్యమం, ప్రగతి, చూపు మొదలైనవి.

**త్రైమాస పత్రికలు :**

మూడు నెలలకొకసారి వెలువడే పత్రికలను త్రైమాస పత్రికలని అంటారు. ఇవి చాలా వరకు సంస్థాగత పత్రికలు, సాహిత్య పత్రికలు, ఉద్యమ పత్రికలు అయి ఉంటాయి. ఇవన్నీ చందాదారుల సహకారంతో నడుస్తుంటాయి. అందువల్ల మార్కెట్లో అంతగా కనిపించవు.

***ఉదాహరణకు :*** జయంతి, తెలుగు, ప్రస్థానం, తెలుగుజ్యోతి, శ్రమజీవి, భూమిక మొదలైనవి.

**అర్ధవార్షిక పత్రికలు :**

ఆరునెలలకొకసారి విడుదలయ్యే పత్రికలు ఇవి. తెలుగులో వీటి సంఖ్య అతి స్వల్పంగా ఉంది. ఇవి కూడా సంబంధిత అంశాలపై ఆసక్తి గల చందాదారులకు ఉద్దేశించినవై ఉంటాయి.

***ఉదాహరణకు :*** చైతన్య కవిత, ప్రధాన వ్యాససూచి మొదలైనవి.

**వార్షిక పత్రికలు :**

ఏడాదికొకసారి ప్రచురితమయ్యే పత్రికలివి. అయితే సాధారణంగా ఇవి సమాచార సంబంధమైనవిగా ఉంటాయి. రిఫరెన్స్‌కు ఉపయోగపడే సంచికలు ఇవి.

***ఉదాహరణకు :*** ఆంధ్రప్రదేశ్ పరిపాలన నివేదిక, విజేత కాంపిటీషన్స్ ఇయర్ బుక్, ఉద్యోగ సోపానం ఇయర్ బుక్, ఆంధ్రప్రదేశ్ వార్షిక దర్శిని, రంజని తదితర వార్షిక సంచికలు మొదలైనవి.

**అనియతకాల పత్రికలు :**

కొన్ని రకాల పత్రికలకు సమయం ఉండదు. కొన్ని సంచికలు ఏడాదికి ఒకసారి వస్తాయి. కొన్నేళ్ళు ఆ పత్రికే కనిపించదు. ఆయా సందర్భాలలో వీటిని విడుదల చేస్తుంటారు. అన్ని వనరులూ సమకూరినప్పుడు పత్రిక నడపడం, మిగిలిన సమయంలో నడపకపోవడం చేస్తుంటారు.

**ఉదాహరణకు :** ఇండియా టుడే సాహిత్య సంచిక, ప్రజాశక్తి–సైద్ధాంతిక బులిటిన్ మొదలైనవి.

**ప్రచురించే అంశాలను బట్టి విభజన :**

పత్రికలలోని ప్రధాన విషయాన్ని బట్టి వాటిని కింది విధంగా విభజించవచ్చు.

**సాహిత్య పత్రికలు :**

సాహిత్యం ప్రధానంశంగా గల పత్రికలూ ఈ కోవకు చెందుతాయి.

**ఉదాహరణకు :** భారతి, స్రవంతి, తెలుగు మొదలైనవి.

**ఆధ్యాత్మిక పత్రికలు :**

ఇవి భారతీయ ఔన్నత్యాన్ని సమాజానికి పరిచయం చేస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నాయి.

**ఉదాహరణకు :** సప్తగిరి, దర్శనమ్, సనాతన సారధి, ఋషిపీఠం మొదలైనవి.

**సినిమా పత్రికలు :**

తెలుగు సినిమా రంగానికి చెందిన పత్రికలు అనేకం. సినిమా పత్రికల్లో మొదటిది చిత్రకళ. ఇది 1938లో వెలువడింది. దీని తరువాత రూపవాణి, సినిమారంగం, సినిమా, మధురవాణి, సితార, జ్యోతిచిత్ర, శివ రంజని, విజయచిత్ర మొదలగునవి.

**పిల్లల పత్రికలు :**

తెలుగులో పిల్లలకు సంబంధించిన కథలు, గేయాలు, బొమ్మలతో పిల్లల పత్రికలు 1940 ప్రాంతాల్లో మొదలయ్యాయి. న్యాపతి రాఘవరావు 'బాల' తొలి తెలుగు పిల్లల పత్రిక. తరువాత చందమామ, బాలమిత్ర, బాలభారతం, బాలభారతి వంటి పత్రికలు వెలువడ్డాయి.

ఇవేకాక విద్య, ఉపాధి పత్రికలు, హాస్య పత్రికలు, విజ్ఞాన పత్రికలు, శృంగార పత్రికలు, వ్యవసాయ పత్రికలు, వైద్య విజ్ఞాన పత్రికలు, ఆర్థికరంగ పత్రికలు మొదలగు అనేక అంశాలకు సంబంధించిన పత్రికలు ఉన్నాయి.

**సాంకేతిక ఆధారంగా వచ్చిన పత్రికలు :**

ఆధునిక సాంకేతిక విప్లవాన్ని ఆధారం చేసుకుని తెలుగులో వచ్చిన పత్రికలను ఈ విభాగం కింద చేర్చవచ్చు.

**ఉదాహరణకు :** 'నెచ్చెలి' – అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి వెలువడుతున్న అంతర్జాల మహిళా పత్రిక.

'సుజన రంజని' – సిలికానాంధ్ర వారి మాసపత్రిక

'భూమిక' – స్త్రీ వాద సాహితీపత్రిక

కొత్తపల్లి – 'ఇ' పుస్తకం

ఈవిధంగా తెలుగు వెలువడిన, వెలువడుతున్న పత్రికలను గురించి చెప్పుకోవచ్చు.

**పత్రికా భాష :**

పత్రికల్లో ఉపయోగించే భాష సులువుగా అర్థమయ్యేలా ఉండాలి. అక్షరాలు కూడాబలుక్కుని చదువుకునే వారికి కూడా అర్థమయ్యేలా వాక్యాలు ఉండాలి. సామాన్య పాఠకులు పత్రికను చదువుతారనే విషయాన్ని గుర్తించాలి. పత్రికల్లో రాసేటప్పుడు క్రింది విషయాల్ని గుర్తు పెట్టుకుంటే సమంజసంగా ఉంటుంది.

- వాక్యాలు చిన్నదిగా ఉండాలి. నాలుగు అయిదు మాటలతో ఒక వాక్యం ఉంటే బాంగుంటుంది.
- వాక్యంలో ఒకే పదం రెండుసార్లు రాకుండా ఉండాలి. అలా ఒకే పదం రాస్తే పాఠకులకు విసుగ్గా ఉంటుంది.
- వాక్యాన్ని రోజు (ఉదా: బుధవారం), తేదీ, పట్టణం, గ్రామం పేరుతో ప్రారంభించకూడదు. సమయంతోనూ మొదలు పెట్టకూడదు. అలా రాస్తే వాక్యం బలహీనంగా ఉంటుంది.
- ఒక్కో పేరాలో సాధ్యమైనన్ని తక్కువ వాక్యాలు ఉండాలి.
- పాఠకులకు పరిచయమైన, తేలికైన పదాలు రాయాలి. సామెతల వంటివి కూడా జనసామాన్యంలో ఉన్నవే ఉపయోగిస్తే మంచిది.
- దీర్ఘ సమాసాలు, సంక్లిష్ట వాక్యాలు రాయకూడదు.
- కవితాత్మక ధోరణి వద్దు. పాండిత్య ప్రదర్శన కోసం వార్తలు రాస్తే అవి వృధా అనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

**శైలీ వైవిధ్యాలు :**

పత్రికలలో ఒకేవిధమైన శైలి ఉండకూడదు. సంపాదకీయాల్లో, ప్రత్యేక వ్యాసాల్లో సృజనాత్మకమైన శైలి ఉండాలి. వార్తా రచనలో విషయ ప్రధానమైన శైలి ఉండాలి. వార్తలు సేకరించడం ఒక భాగం అయితే దాని వార్తగా వ్రాయడం మరో భాగం. అందుకనే ఏది వార్త అనికాక ఎలాంటి శైలి వార్త అనే ధోరణి వ్యాప్తిలోనికి వచ్చింది. సంఘటన కాక దాన్ని రాసే పద్ధతి పత్రికకు జీవం పోస్తుంది.

వార్తా సంఘటనలో ఉన్న సంగతుల కంటే దాన్ని రాసిన తీరును బట్టి వార్తకు విలువ ఉంటుంది. ఎత్తుగడ, అంశాలను గుదిగుచ్చే పద్ధతి, విపులీకరణ ధోరణి మొదలైనవి పత్రికా రచనకు శిల్పాల వంటివి.

పత్రికల్లో స్థానిక వార్తలు, విదేశీ వార్తలు, వాణిజ్య వార్తలు, వరదలు, అగ్ని ప్రమాదాలు మొదలైన అంశాలు వార్తలుగా ఉంటాయి. వీటిని కూర్చడంలో ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. కొన్ని పత్రికలు ఈ కూర్పులో కొన్ని నియమాలు పాటిస్తాయి. ఉదాహరణకు సంగ్రహ ప్రకటనలు రెండో పేజీలో, క్రీడల ప్రకటనలు చివరి పేజీలో ఉంటాయి.

పత్రికా కార్యాలయానికి వార్తల్లో హృదయ స్పందన కలిగించే వార్తలను బయటకు తీసి నాటకీయంగా వార్తా రచన చేయడం వార్తా రచనలో ఒక పద్ధతి. సాధారణంగా పత్రికల్లో అతిశయోక్తులు ప్రచురించరు. వ్యాఖ్యలు చేయరు. వ్యాఖ్యలు చేయవలసి ఉంటే వాటిని సంపాదకీయాల్లో చేస్తారు. ఒకవేళ ఒక అంశాన్ని ఎక్కువ చేసి చెప్పాలనుకుంటే మరొకరు చెప్పినట్లు రాస్తారు. అలాగే కర్త మనుష్య వాచి అయినప్పుడు ఆ వ్యక్తికి సంఘంలో ఉన్న గౌరవాన్ని బట్టి గౌరవ సూచికమైన బహువచన క్రియ ఏకవచనంలో ఉంటుంది. ఉదాహరణకు మంత్రి శ్రీ రామయ్య చెప్పారు, ముద్దాయి సోమయ్య చెప్పాడు అని రాయాలి.

న్యాయస్థానాలను కించపరిచే వ్యాఖ్యలు, పరువు నష్టం, గౌరవ భంగం కలిగించే వార్తలు, వేర్పాటు వాదనలు సమర్థించే వార్తలు ప్రచురించరు. మత కలహాలు రెచ్చగొట్టే విధంగా రాయరు. అశ్లీల వార్తలు చెప్పరు. సందిగ్ధ భావాలను రాయరు. ఊతపదాలు, పునరుక్తులు లేకుండా చిన్న వాక్యాలతో రాస్తారు. చిన్న పేరాలుగా విభజించి వార్తలను రాస్తారు. విరామ చిహ్నాలను సక్రమంగా ఉంచుతారు.

ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టే వార్తలుంటే వాటిలోని బిగువును తగ్గిస్తారు. అనవసరమైన వార్తలను తొలగిస్తారు. పత్రికా నీతికి భిన్నంగా ఉన్న విషయాలు తీసి వేస్తారు. పత్రిక అభిప్రాయాలకు అనుగుణంగా వార్తను మలచుకుంటారు.

ఈవిధంగా పత్రికా రచన పాఠకులకు ఆసక్తిని కలిగించే విధంగా తయారవుతుంది.

## తొలి తెలుగు పత్రికలు

| | | |
|---|---|---|
| తొలి తెలుగు పత్రిక | – | వృత్తాంతి (1838) |
| తొలి తెలుగు వారపత్రిక | – | వర్తమాన తరంగిణి (1842) |
| తొలి తెలుగు పక్షపత్రిక | – | శ్రీయక్షిణి (1863) |
| తొలి తెలుగు మాసపత్రిక | – | హితవాది (1848) |
| తొలి తెలుగు వైజ్ఞానిక పత్రిక | – | విజ్ఞాన వర్ధని |
| తొలి తెలుగు వ్యవసాయ పత్రిక | – | జ్ఞానోదయం |
| తొలి తెలుగు బాలల పత్రిక | – | జనవినోదిని |
| నవలల పోటీ నిర్వహించిన తొలి తెలుగు పత్రిక | – | చింతామణి |
| ఫోటోలు ప్రచురించిన తొలి తెలుగు పత్రిక | – | శారద |
| కథానిక, కవితలు ప్రచురించిన తొలి తెలుగు పత్రిక | – | కల్పలత |
| మహిళల నిర్వహణలో వెలువడిన తొలి తెలుగు మాసపత్రిక | – | హిందూ సుందరి |
| క్విజ్ నిర్వహణ జరిపిన తొలి తెలుగు పత్రిక | – | సరస్వతి |
| తొలి తెలుగు హాస్య పత్రిక | – | ఆనంద వాహిని |
| కళల పరిరక్షణకు అంకితమైన తొలి తెలుగు పత్రిక | – | చోళ |
| తొలి తెలుగు వైద్య పత్రిక | – | ధన్వంతరి |
| ప్రబంధాలు ప్రచురించిన తొలి తెలుగు పత్రిక | – | ప్రబంధ కల్పవల్లి |

| | | |
|---|---|---|
| తొలి తెలుగు సంస్కరణల పత్రిక | - | వివేక వర్ధని |
| తొలి తెలుగు బ్రహ్మ సమాజ పత్రిక | - | తత్త్వబోధిని |
| తొలి తెలుగు గ్రాంధిక భాషోద్యమ పత్రిక | - | వజ్రాయుధం |
| తొలి తెలుగు వ్యావహారిక భాషోద్యమ పత్రిక | - | తెలుగు |
| రచయితల నిర్వహణలో వచ్చిన తొలి తెలుగు పత్రిక | - | ఆంధ్రభారతి |
| గ్రామీణ విలేఖరులను నియమించిన తొలి తెలుగు పత్రిక | - | ఈనాడు |
| తెలుగులో తొలి పోటీ పరీక్షల పత్రిక | - | ప్రజ్ఞ |
| రంగులలో ముద్రణ ప్రారంభించిన తొలి తెలుగు పత్రిక | - | ఆంధ్రజ్యోతి |
| స్థానిక అనుబంధాలను ప్రారంభించిన తొలి తెలుగు పత్రిక | - | ఉదయం |
| ఒకేసారి తొమ్మిది కేంద్రాలనుంచి ప్రారంభమైన తొలి తెలుగు పత్రిక | - | వార్త (1.2.1996) |
| అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, నగరాలలో ఒకేసారి ఒకేరోజు ఆవిష్కరణ జరిగిన తొలి తెలుగు పత్రిక | - | ఆంధ్రజ్యోతి(15.10.2002) |

**ఆధార గ్రంధాలు:**

1. తెలుగు జర్నలిజం - డా॥ బూదరాజు రాధాకృష్ణ
2. తెలుగు మౌలికాంశాలు - డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ప్రచురణ
3. పత్రికలలో వ్యాపార ప్రకటనలు - అనువాద సమస్యలు - డా॥ ఎల్లే విజయానందరాజు
4. మాధ్యమాలకు రచన - డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ప్రచురణ
5. సమాచారాల చేరవేత మరియు పాత్రికేయత్వం - డా॥ ఎస్జీడీ చంద్రశేఖర్